




టిడ్కో గృహ రుణాల ప్రక్రియ వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ శాశ్వత గృహాలను అందజేసే ప్రక్రియలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి ఈ నెల 25వ తేదీలోపు రూ.10 కోట్ల మేర రుణాలను త్వరితగతిన మంజూరు చేయించాలని మెప్మా విభాగం, నగర పాలక సంస్థ హౌసింగ్ విభాగం అధికారులను కమిషనర్ హరిత ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో టిడ్కో గృహాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ శాశ్వత గృహ హక్కు పథకం వర్తించడానికి అవసరమైన రుణాలను అందించి పేదల అభ్యున్నతికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, మెప్మా పీడీ రవీంద్ర బాబు, టిడ్కో ఇఇ ఉమా శంకర శాస్త్రి, నగర పాలక సంస్థ టి.పి.ఆర్.ఒ ప్రసాద్, హౌసింగ్ అధికారులు సిద్ధిఖ్, సందీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచుతూ తీసుకున్న నిర్ణయం 'మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు' అన్న చందంగా ఉందని సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కేంద్రం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బాలాజీ నగర్ లోని సిపిఎం కార్యాలయం నుంచి జ్యోతిరావు పూలే విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలైన మరుసటి రోజే గ్యాస్ ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకొని బిజెపి తన అవకాశవాద వైఖరిని చాటుకుందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశమే హద్దుగా పెరిగిపోతున్న కారణంగా ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో బిజెపి ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం హేయమన్నారు. బిజెపి ప్రభుత్వం గ్యాస్ ధర పెంపుతూ నిర్ణయం తీసుకొని మరో సారి సామాన్యుడి నడ్డి విరిచిందన్నారు. గ్యాస్ సబ్సిడీని అమలులోకి తెచ్చి ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి అధికారంలోకి రాకముందు రూ.414 లున్న ఉన్న సిలిండర్ ధర కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల రూ.1150 లకు చేరుకుందన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నం టుతున్నాయన్నారు. గ్యాస్ సబ్సిడీతో సామాన్యులకు అందించే పరిస్థితిని బిజెపి కాలరా సిందన్నారు. నగదు బదిలీ పథకం పేరుతో గ్యాస్ పై ఇస్తున్న సబ్సిడీకి బిజెపి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందని, దాని ఫలితంగా గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటు తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు లక్షల కోట్ల రాయి తీలు కల్పిస్తూ సామాన్యులపై భారాలు విధించడం మోడీ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు రోజువారి పెంచుతున్నారని, తక్షణమే పెంచిన గ్యాస్ ధరల్ని రద్దు చేయాలని, గ్యాస్ సబ్సిడీ ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగేశ్వర రావు, షేక్ మస్తాన్‌బీ, పి. సూర్య నారాయణ, ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి బీపీ నరసింహ, నగర నాయకులు ఆర్ శ్రీనివాసులు, కె. ఏమేలు, శ్రీనివాసులు రెడ్డి, మూలం ప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



కందుకూరులో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శోభిక



ఉలవపాడులో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శోభిక

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి-ఉలవపాడు: ఈనెల 13న జరుగనున్న ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా శుక్రవారం కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక మండల కేంద్రమైన ఉలవపాడులో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో పటిష్టమైన బందోబస్తు మధ్య ఎన్నికలు జరగాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో చుట్టూ కాంపౌండ్ లేనందున బారికేడు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రంలో షామీయాలతో నీడ ఏర్పాటు చేయాలని ప్రత్యేక కౌంటర్ చేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తహశీల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్ తెలిపారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ఓటరు స్వేచ్ఛగా ఓట్లు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ త్యాగరాజయ్యకు సూచించారు. ఆమె వెంట ఎంపిడిఒ చెంచమ్మ, ఆర్ఐ శ్రావణి, పంచాయతీ కార్యాదర్శి విజయమ్మ, వీరయ్య తదితరులున్నారు.

ప్రజాశక్తి-కందుకూరు: ఈనెల 13వ తేదీ జరగనున్న శాసనమండలి పోలింగ్ కేంద్రాలను కందుకూరు సబ్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పోలింగ్ కేంద్రాల పరిస్థితులను పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. ఎన్నికల సజావుగా జరగడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిఎస్‌పి కండే శ్రీనివాసులకు చెప్పారు. పూర్తిస్థాయిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆమె వెంట కార్యక్రమంలో సిఐ వెంకట్రావు, తహశీల్దార్ డి.సీతారామయ్య, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తదితరులున్నారు.

అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ ఇవ్వాలి

అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి–తోటపల్లిగూడూరు

అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు ఆదేశానుసారం జగన్మోహన్ రెడ్డి గ్రాట్యూటీ ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బ రావమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నరుకురు సెంటర్లోని జక్కా వెంకయ్య స్మారక సిఐటియు కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్ల సమావేశం సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రాజా అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి సుబ్బరావమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే కేంద్ర బడ్జెట్లో నిధుల కోతను విధించడం జరిగిందని విమర్శించారు. సుప్రీం కోర్టు ఆదేశానుసారం అంగన్వాడీలకు గ్రాట్యూటీ ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అంగన్వాడీలకు కనీస వేతనం ఉద్యోగ భద్రత కల్పించడంలో విఫలమైందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20వ తేదీన విజయవాడలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహా ధర్నాలో అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులైనటువంటి మీగడ వెంకటేశ్వర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్ మాట్లాడుతూ అంగన్వాడీల రావాల్సిన బకాయి వెంటనే విడుదల చేయా లన్నారు. గత రెండు నెలల నుంచి అంగన్వాడీల వేతన బకాయిలు ప్రభుత్వం పెండింగ్లో పెట్టిందని తెలిపారు. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెహనా బేగం మాట్లాడుతూ అంగన్వాడీల పై రాజకీయ వేధింపులు అధికమవుతున్నాయని తెలిపారు. ఉద్యోగ భద్రత లేక అంగన్వాడీలు భయాం దోళనలకు గురికావాల్సి వస్తుందన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు, కనీస వేతనం అమలు, గ్రాట్యూటీ కోసం నిర్వహిస్తున్న జరుగు మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు మస్తానమ్మ, ఆశ వర్కర్స్ జిల్లా ట్రెజరర్ మధుసూదనమ్మ, సిఐటియు మండల గౌరవ అధ్యక్షులు వేగురూ వెంకయ్య, ఆటో కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలగట్ల సురేష్, మండల ఆటో యూనియన్ అధ్యక్షులు నానిన పరశురామయ్య, అంగన్వాడి వర్కర్స్ మండల నాయకులు ఆర్. రేవతి, ఎం. కవిత, ఎం. ప్రమీల, వత్సల, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



వరిధాన్యం మొత్తాన్ని

ప్రభుత్వం కొనుగోలు చేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో రైతులు పండించిన వరి ధాన్యం మొత్తం (జిల్లా అవసరాలకు పోను) రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం ఈ మేరకు ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో చాలినంత సిబ్బందిని నియమించాలన్నారు. రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన మేరా గోతాలు, ధాన్యం తేమ శాతాన్ని లెక్కించేందుకు పనిచేసే పరికరాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం తేమ శాతం ఒక చోట చూడాలని, అదే ప్రదేశంలో ప్రభుత్వ అధికారులు, మిల్లర్ల ప్రతినిధు లుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం మిల్లుకు ధాన్యం తోలుకుపోయే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవా లన్నారు. ఎట్టి పరిస్థి తుల్లోనూ మిల్లు వద్దకు రైతులను పంపకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈకెవైసి బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని, నమోదు కాకపోతే రైతుకు ఎటువంటి సంబంధం లేకుం డా ఉండేలా జాగ్రత్త తీసుకోవా లన్నారు. కౌలు రైతులకు పంట సాగు బడి చేసే ప్రాంతానికి స్థానిక రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా కలిసి వెళ్లి పంటను పరిశీలించి ధృవీకరణ పత్రం అందజేయాలన్నారు. ఆ పత్రాన్ని ఆధారం చేసుకొని ధాన్యాన్ని కేంద్రాలలో కొనుగోలు చేసి కౌలు దారుడికి నగదు అందజేయాలన్నారు. చిన్న రైతులకు పండించిన ధాన్యాన్ని అరబెటు కోవడానికి పట్టలు అందజేయా లన్నారు. సాధారణంగా జిల్లాలో మార్చి ,ఏప్రిల్‌లో ధాన్యం కోసి పొలంలో రాసి పోసిన రోజు 17 శాతం తేమ ఉంటుందన్నారు. తేమ శాతం చూపించి మిల్లర్ లు తూకం ఎక్కువ తీసుకోవడం.. మద్దతు ధర కంటే తక్కువ కు కొనడం పరిపాటైపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వమే 20 శాతం వరకు సడలింపు ప్రకటించి, తూకంలో ఎక్కువ తీసుకోకుండా ,ధర తగ్గించకుండా కొనుగోలు కేంద్రం వద్దనే ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి-పొదలకూరు

వేసవి తాపం వలన ప్రజలు ముఖ్యంగా యువత ...చెరువు లోకి ఈతకు వెళ్లి ప్రమాద బారినపడకుండా మంత్రి కాకాణి ఆదేశాలతో.. పోలీస్ శాఖ, గ్రామ పంచాయతీ వారి సహాయ సహకారాలతో ప్రమాద హెచ్చరిక బోర్డును శుక్రవారం ఏర్పాటు చేశారు. చెరువులో ప్రమాదాలు కారణంగా ఈతలు కొట్టుట..చెరువులోకి దిగుట నిషేదించడమైనది గాను, పోలీసు వారు తీసుకోను చర్యలకు బాధ్యులు కాగలరని పోలీస్ శాఖ వారి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పొదలకూరు గ్రామ పంచాయతీ సెక్రటరీ అల్లాభక్షు ,సచివాలయం మహిళా పోలీస్ విజయలక్ష్మి , స్థానిక వార్డ్ మెంబెర్స్ బసవనూరి.హరి ప్రసాద్, గుంటి భాస్కర్ పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో భక్తులు కానుకల ద్వారా హుండీలలో సమర్పించిన నగదు నిల్వల లెక్కలను శుక్రవారం నిర్వహించారు. 37హుండీల ద్వారా రూ.1,04,84,868 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కెబి శ్రీనివాసరావు తెలిపారు. అదేవిధంగా ఫారెన్ కరెన్సీ యుఎస్ డాలర్లు 72, యూరోస్ 175, యునైటెడ్ డినిమ్స్ వెయ్యి, మరో రెండు దేశాలకు సంబంధించి 18 వచ్చాయి. బంగారం 285 గ్రాములు, వెండి 1.940 గ్రాములు రావడం జరిగింది. హుండీ లెక్కింపు 2022 డిసెంబర్ 11వ తేది నుండి ప్రస్తుత ఏడాది మార్చి 3వ తేది వరకు 18 శనివారాలకు సంబంధించి 37 హుండీలలో సమర్పించిన నగదును లెక్కించినట్లు వివరించారు. బ్యాంకులో డిపాజిట్ చేయనున్నారు. లెక్కింపునకు పర్యవేక్షణాధికారులుగా వై.బైరాగిచౌదరి, వివిఎల్ రవీంద్రనాథ్ హాజరయ్యారు. లెక్కింపులో సిబ్బంది పాల్గొన్నారు.



నగదును లెక్కిస్తున్న సిబ్బంది

టిడిపి ఎంఎల్‌సి మృతి బాధాకరం

ప్రజాశక్తి-కందుకూరు: తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, శాసన మండలి సభ్యులు, గన్నవరం టిడిపి ఇన్‌ఛార్జి బచ్చుల అర్జునుడు మృతి బాధాకరమని టిడిపి నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ అన్నారు. గొప్ప బీసీ నాయకుడుని కోల్పోయామని తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ తన రాజకీయ జీవితం సామాన్య కార్యకర్తగా మొదలుపెట్టిన బచ్చుల అర్జునుడి మరణం వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. వారి మరణం పార్టీకి తీరని లోటన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు.

తోటపల్లిగూడూరు: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఎంఎల్‌సి బచ్చుల అర్జునుడు మతి అత్యంత బాధాకరమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిబద్ధతకు మారుపేరుగా గుర్తింపు పొందిన అర్జునుడు మతి టీడీపీకి తీరని లోటన్నారు.సర్వేపల్లి నియోజకవర్గంలో ఎంతో కష్టపడి పనిచేశారని సురేంద్ర తెలిపారు. కుటుంబ సభ్యులకు సురేంద్ర తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అసంపూర్తిగా భవన నిర్మాణం

ప్రజాశక్తి-సైదాపురం: స్థానిక మండల పరిషత్ నూతన భవన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఇక్కడున్న మండల పరిషత్ కార్యాలయ భవనం పాత బడి ఉరుస్తుండడంతో, ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి 1.60కోట్ల రూపాయలు మంజూరు చేసింది.15ఫైనాన్స్ ద్వారా కోటి రూపాయలు జిల్లా పరిషత్, మరో 60లక్షల రూపాయలు మండల పరిషత్ గ్రాంటు ద్వారా ఇచ్చేలా ప్రభుత్వం నిధులు ఏర్పాటు చేసింది. గుత్తేదారు భవనానికి పునాదులు వరకు పూర్తిచేశారు. పనిచేసిన వరకు బిల్లులు చెల్లిస్తే పనిమొద లు పెడతానని గుత్తే దారుడు అంటున్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి భవన నిర్మాణ పనులను సత్వరం పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఎల్ల వేళలా అందుబాటులో ఉంటా

ప్రజాశక్తి-సైదాపురం: మండల అభివృద్ధికి, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎపి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్, వెంకటగిరి నియోజక వర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకు మార్ రెడ్డి తెలిపారు. మండలంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆర్ ఆర్ కళ్యాణ మండపం లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

21వ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు: పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి 21వ వార్షికోత్సవ వేడుకలు దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-నెల్లూరు: అధికార పార్టీ నుంచి తాను దూరంగా రావడంతో స్వేచ్ఛా జీవినయ్యానని రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగర నియోజకవర్గ పరిధిలోని ఆర్‌సిఎం కమ్యూనిటీ హాల్లో యువనేత అమరేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను విద్యార్థి నాయకుడిగా, రాజకీయ నాయకుడిగా అడుగులు ప్రారంభించిన 30 ఏళ్ల నాటి నుంచి ఈ ప్రాంత ప్రజలతో సన్నిహిత సంబంధాలున్నాయని తెలిపారు. తన సొంత బిడ్డలా ఆదరించారని, పాత సంఘటనలను గుర్తు చేశారు. యువత ఉద్యోగాల అన్వేషణలో జరిగే పోటీ పరీక్షల కోచింగ్‌కు సంబంధించి తన వంతు సహాయ సహకారాలు తప్పకుండా అందజేస్తామని యువతకు భరోసా కల్పించారు. అదే సమయంలో క్రీడా రంగంలో యువతను ప్రోత్సహించేందుకు క్రీడా పరికరాలు పంపిణీ చేస్తామన్నారు. యువతకు ఎల్లవేళలా తాను అండగా నిలుస్తామన్నారు. నగర నియోజకవర్గ పరిధిలోని తన అభిమానులు, స్నేహితులు, సన్నిహితులకు ఏ అవసరం వచ్చినా తన వంతు సహాయసహకారాలు తప్పకుండా ఉంటాయన్నారు. దాదాపుగా పదేళ్లపాటు నగర నియోజకవర్గానికి దూరంగా ఉన్నా. ఆదేవుడి దయవల్ల ఎట్టకేలకు అన్ని ప్రాంతాలలో ఉన్న నా మిత్రులను, శ్రేయోభిలాషులను కలుసుకునే అవకాశం మళ్ళీ దక్కడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అధికారంలో ఉన్నపుడు అందరు వస్తుంటారు, పలకరిస్తుంటారని, అయితే కష్టాలలో ఉన్నపుడు మాత్రం వచ్చే పలకరించేది, ప్రోత్సహిన్నిచ్చేది నిజమైన ఆత్మీయులు, స్నేహితులు మాత్రమే అన్నారు. ప్రస్తుతం తాను అత్యంత కష్టకాలంలో ఉన్నా .. తన వెంట నడిస్తే పోలీసుల వేధింపులు ఉంటాయని తెలిసి నప్పటికీ లెక్కచేయకుండా, ధైర్యంగా ముందుకు వచ్చి నగర నియోజకవర్గంలో తనపై ప్రత్యేక అభిమానంతో ఇంతటి ఆత్మీయ సమావేశం నిర్వహించిన కపాడిపాళెం యువతకు పేరుపేరున ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనుచర కార్పొరేటర్లు, మద్దతు దారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



మాట్లాడుతున్న రూరల్ ఎంఎల్‌ఎ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-నెల్లూరు : ముత్తుకూరు రోడ్డు సెంటర్‌లో ఓ భారీ వాహనం సైకిలిస్టును ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని స్థానికులు వైద్య చికిత్సల నిమిత్తం హుటాహుటిన వైద్యశాలకు తరలించారు. శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకోవడంతో స్థానిక సిపిఎం శాఖ నాయకులు రోడ్డుపై బైటాయించి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. భారీ వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో భారీ వాహనాలు అతి వేగంగా ప్రయాణం చేయడం వల్ల గతంలో చోటు చేసుకున్న ఎన్నో ప్రమాదాల వల్ల అనేక మంది మృతి చెందారని, మరి కొంత మంది అవయవాలు కోల్పోయి జీవనం సాగిస్తున్నారన్నారు. సాధారణ ప్రజలు వాహనదారులు భారీ వాహనాలు రాకపోకల వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దష్టికి తీసుకువెళ్లిన స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు కృషి చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సిఐటియు నగర కార్యదర్శి గజ్జ నాగేశ్వరరావు ,సిపిఎం నగర నాయకులు కాయం శ్రీనివాసులు ,కట్టా సతీష్ ,అల్లంపాటి శ్రీనివాసరెడ్డి, సంపూర్ణమ్మ ,అరవ కుమార్ ,వెంకటేశ్వర్లు ,విద్యాచరణ్ ,రాజా తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై నినాదాలు చేస్తున్న దృశ్యం

'మానుగుంట'ను కలిసిన 'పేర్నాటి'

ప్రజాశక్తి-కందుకూరు: వైసిపి కార్యాలయంలో మాజీ మంత్రి, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డిని వైసిపి తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి కలిసి ఎన్నికల గురించి శుక్రవారం చర్చించారు. ఈ నెల 13వ తేదీన జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై పోలింగ్ ఏజెంట్ల నియమాకానికి సంబంధించి చర్చించుకున్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ

వరిగొండలో పొలంబడి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని వరిగొండ బిట్1 గ్రామంలో శుక్రవారం డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ శాఖ అధికారి యు.గీతాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏ డిఏ రాజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో కంకినల్లి (నల్లకంకి) సోకుతోందన్నారు. ఇది కంటికి కనబడని సూక్ష్మ సాలీడు వర్గానికి చెందిన పురుగులు అని చెప్పారు. ఇవి ఆశించిన ఆకులపై పసుపు వర్ణాపు చారలు ఏర్పడి క్రమేపి ఆకు తొడిమల లోపల, నల్లటి మచ్చలు ఏర్పడుతాయన్నారు. పురుగు నష్ట లక్షణాలు గుర్తించిన వెంటనే 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు ప్రొఫెనోఫోస్ ఎకరానికి 400 మిల్లి లీటర్లు, లేక డైకో ఫోల్ ఎకరానికి 1000 మిల్లి లీటర్లు పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఇఓ డి. ప్రసన్న, విఏఏ జి సుమంత్, రైతులు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు చేయూత

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: వికలాంగ విద్యార్థులకు అన్ని విధాల చేయూత ఇస్తానని ప్రముఖ పారిశ్రామిక వేత్త, విద్యాదాత నాయుడు ఆదికేశవుల రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం స్థానిక ఎస్ఎన్ ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదికేశవుల రెడ్డి తల్లి నాయుడు నాగేశ్వరమ్మ 3వ వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆదికేశవుల రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన కుర్చీలు అందజేస్తానన్నారు. వికలాంగ విద్యార్థులు అభ్యున్నతి కోసం తన వంతు సాయం చేసేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. వికలాంగ విద్యార్థులకు అవసరమైన ఫిజియోథెరపీకి అవసరమైన సామగ్రి, వారు పాఠశాలకు వచ్చేందుకు ప్రతి నెలా ఆటో ఛార్జీలను తాను భరిస్తానని పేర్కొన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు ఎన్నికైన అభ్యర్థులకు ఎన్.డి.ఆర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ (చెన్నయ్)లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో నాయుడు వెంకట నర్సారెడ్డి, ముంగమూరి యశ్వంత్ రెడ్డి, పాఠశాల హెడ్మాస్టరు ఎస్. కె. రియాజ్ అహ్మద్, కళాశాల ప్రిన్సిపల్ ధనుంజయ, ఉపాధ్యాయులు ఇంగిలేల బాలకష్ణ, పాఠశాల, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపునకు ప్రచారం



నెల్లూరు రూరల్ ప్రాంతంలో ప్రచారం చేస్తున్న దృశ్యం



కలెక్టరేట్‌లో ప్రచారం చేస్తున్న ప్రజాశక్తి సిబ్బంది



నెల్లూరు రూరల్ ప్రాంతంలో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

:నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల ఎంఎల్‌సి గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎం.వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థిగా పి.బాబురెడ్డిలకు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నగరంలోని పలు డివిజన్లలో ప్రచారం ముమ్మరంగా సాగుతుంది. ఎంఎల్‌సి ఎన్నికల తేదీ దగ్గర పడుతున్నందున నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు ధీటుగా పిడిఎఫ్‌ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపును ఆకాంక్షిస్తూ ప్రజాసంఘాలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజలకు వివరించి చైతన్యవంతం చేస్తూ ,కరపత్రాలు పంపిణీ చేస్తూ ముందుకు సాగుతున్నారు. 25వ డివిజన్‌లో సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండా ప్రసాద్, శాఖ కార్యదర్శి బి.బాబు, పార్టీ సభ్యులు ఎ.మోహన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. కొత్తూరు ప్రాంతంలోని వల్లూరు కాలనీలో సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు కండె కోటేశ్వరరావు, శాఖ కార్యదర్శి ఖయ్యూం, నౌషాద్, నరికే దశయ్య తదితరుల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మూలాపేట ప్రాంతంలోని రాజాగారి వీధి, గొల్లవీధి తదితర ప్రాంతాల్లో నాయకులు అల్లాడి గోపాల్, ఎస్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. అరవింద్ నగర్ ప్రాంతంలో వరుసగా 10వ రోజు ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం జిల్లా ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఆటో కార్మిక సంఘం కార్యదర్శి సుధాకర్ ,రూరల్ ఆటో శాఖ కార్యదర్శి టి, వెంకి, ఆర్‌టిసి ఆటో స్టాండ్ సభ్యులు పెరుమాళ్లు, బాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి సిబ్బంది ప్రచారం

పిడిఎఫ్ ఎంఎల్ సి అభ్యర్థుల గెలుపును ఆకాంక్షిస్తూ ప్రజాశక్తి సిబ్బంది ప్రచారం చేశారు.శుక్రవారం నగరంలోని కలెక్టరేట్, డిఆర్‌డిఎ, ట్రెజరీ, డిపిఆర్‌ఒ కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించారు. ఉద్యోగ,ఉపాధ్యాయ కార్మిక వర్గాల సమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో తమ గళాన్ని వినిపించేందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఎం వెంకటేశ్వర రెడ్డి, పి బాబిరెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాశక్తి మేనేజర్ కె.కోటేశ్వరరావు, డెస్క్ ఇన్‌ఛార్జి యు.వి. రమణయ్య, స్టాఫర్ పి.బాలకృష్ణ, సిబ్బంది కత్తి చిన్నా, అత్తిమూరు శ్రీనివాసులు, కరుణానిధి, ఎన్.అరుణ, మహేష్, భువనేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి–కందుకూరుమండలంలోని పలుకూరు గ్రామంలో కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ గెలుపుకోసం ప్రచారం శుక్రవారం నిర్వహించారు. ప్రచారంలో బొద్దులూరి కొండలరావు, గోచిపాతల మోషే, నాదెళ్ల వెంకట సుబ్బారావు, గోగినేని శివరామయ్య, రావుల రవి, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు :ఎపి ఎన్‌జిఒ భవన్‌లో జిల్లా మహిళా విభాగం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. శుక్రవారం చేపట్టిన ఈ ఎన్నిక అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా చైర్ పర్సన్ యు.చిన్నమ్మ మాట్లాడుతూ మార్చి 8 వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ను పురస్కరించుకుని ప్రతేడాది మాదిరిగా ఈ సంవత్సరం కూడా జిల్లా లోని మహిళా ఉద్యోగులకు ఎపిఎన్‌జిఒఎస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8వ తేదిన ఎన్‌జిఒ భవన్‌లో ఈ క్రీడాపోటీలు ప్రారంభం అవుతాయని, సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించి అనంతరం గెలుపొందినవారికి జిల్లా అధికారుల బహుమతులు అందచేస్తామన్నారు. ఈ వేడుకలను జిల్లా లోని మహిళా ఉద్యోగులు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూతన మహిళా కమిటీ ఎన్నిక కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా మన్నేపల్లి. పెంచలరావు, కార్యదర్శి నాయుడు. వెంకటస్వామి, కోశాధికారి బండారుపల్లి. వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షులు నందిమండలం. ఆంజనేయ వర్మ, అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న పీడీ రవీంద్ర

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

ఆర్‌పిలు వారివారి విధులు సక్రమంగా నిర్వహించాలని లేనిపక్షంలో వారిపై చర్యలు తప్పవని మెప్మా పీడీ రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు మెప్మా కార్యాలయంలో అన్ని బ్యాంకు మేనేజర్లు సిఎంఎం, సిఆర్‌ఎస్ ఆర్‌పిలతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మెప్మా పీడీ రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ ప్రయారిటీ అయిన టిడ్కో గృహ నిర్మాణానికి సంబంధించి లోనింగ్ ప్రాసెస్ చేయడం కోసం ఇప్పటికే బ్యాంకు మేనేజర్లు అందరూ కూడా మంచి పురోగతి ఇచ్చారని తెలిపారు. దాంతోపాటు ఇంకా మనకు 42 అప్లికేషన్లు వివిధ బ్యాంకులలో పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి కూడా 15వ తేదీ లోపల ప్రాసెస్ చేయడం కోసం ఈ రివ్యూ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆత్మకూరు విషయానికొస్తే అంతా ప్రోగ్రెస్ బాగుందన్నారు. ఇంకా ఉన్న బ్యాలెన్స్ వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో సిఎంఎం అంకయ్య, టిఎల్‌ఎఫ్ ప్రమీల, సివోస్ మాధవి, అబిద్ బేగ్, అన్ని బ్యాంక్ మేనేజర్లు ఆర్‌పిలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణ నివాసులైన యజ్జల వెంకట్రావు-వైష్ణవి దంపతుల కుమార్తె యజ్జల.సోహిత మొదటి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం సంయుక్త సేవాసంస్థ ద్వారా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో సర్వాయపాలెం, గిరిజన సంఘంలోని పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దాతలు యజ్జల.వెంకట్రావు – వైష్ణవి దంపతులు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ నేటి దాతలు వారి కుమార్తె మొదటిపుట్టిన రోజునుసందర్భంగా ఆడంబరాలకు పోయి వృధా ఖర్చులు చేయకుండా పేదలకు ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని తెలిపారు.

అనారోగ్య సమస్యలతో మూగజీవాలు..

- కానరాని పశువైద్యాధికారులు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలో మూగజీవాలు అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే వైద్యం అందించడంలో వైద్య సిబ్బంది వైఫల్యం చెందారని నాయకులు మాకిరెడ్డి జనార్దన్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూగజీవాల వైద్యం కోసం ప్రయివేట్ వైద్యులను సంప్రదించాల్సిన పరిస్థితి మండలంలో నెలకొందన్నారు. ప్రభుత్వం లక్షల జీతాలు వెచ్చిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూగజీవాలపై ప్రభుత్వ పశు వైద్య సిబ్బందిని సంప్రదిస్తే చేసేది ఏమీ లేక చివరికి జాయింట్ డైరెక్టర్‌కు ఫోన్ చేశామని వెంటనే ఆయన స్పందించి పశువైద్య సిబ్బంది అయిష్టంగానే వచ్చారని తెలిపారు. మూగజీవాలకి ఏమైనా జరిగితే మీరు సమాధానం చెప్తారా అని ఆయన ప్రశ్నించారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

విజేతలకు చీరలు పంపిణీ



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలో నూతనంగా ప్రారంభించిన భాయ్ చికెన్ షాప్ ప్రారంభ సందర్భంగా జనవరి 1 నుండి 31వ తేదీ వరకు తమ షాపులో చికెన్ కొనుగోలు చేసిన వారికి ప్రత్యేక కూపన్లు అందజేసి వాటిలోని నెంబర్లను శుక్రవారం వారి షాపు వద్ద లాటరీ ద్వారా విజేతలను ప్రకటించారు. నెలరోజుల పాటు తమ షాపులో చికెన్ కొనుగోలు చేస్తూ షాపు నుండి పొందిన కూపన్లలో ఉన్న నెంబర్లతో నేడు తీసిన లాటరీలో పదిమందికి రూ.2000 విలువ గలిగిన 10 పట్టు చీరలను షాపు నిర్వాహకులు అందజేశారు. తమ షాపుపై నమ్మకంతో వ్యాపార అభివృద్ధికి సహకరించిన ప్రతిఒక్క కొనుగోలుదారులకు ఈ సందర్భంగా షాప్ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. తమ షాపు ఖాతాదారులు స్థానిక ప్రజలు అధికసంఖ్యలో సమక్షంలో బహిరంగంగా ఈ లాటరీని తీశారు. చికెన్ కొన్నందుకు భాయ్ షాపు ద్వారా తమకు పట్టుచీర లభించడంతో విజేతలు ఎంతో సంతోషిస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. లాటరీ కార్యక్రమానికి విచ్చేసిన జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలుపుతూ కస్టమర్లకు ఆదాయం చేకూర్చేలా అతి తక్కువ ధరకు తమ షాపులో చికెన్, కోడిగుడ్లు అందిస్తున్నామని ఎప్పటిలాగే తమషాపు అభివృద్ధికి సహకరించాలని నిర్వాహకులు ప్రజలను కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-కొడవలూరు : జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని యల్లాయపాలెం మజరా ఎన్ఎండబ్ల్యూ గిరిజన కాలనీలో చోటుచేసుకొంది. వివరాల మేరకు.. గిరిజన కాలనీకి చెందిన చౌటూరు సుబ్బ రామయ్య (55) మద్యానికి బానిసగా మారాడు. నిరంతరం మద్యం సేవిస్తూ కూలీ పనులకు వెళ్లడం మానేశారు. పనులకు వెళ్లకుంటే కుటుంబం ఎలా గడవాలని భార్య ప్రశ్నిస్తుండటంతో జీవితంపై విరక్తి చెంది, మద్యంలో పురుగు మందు కలుపుకొని బుధవారం ఆత్మహత్యాయత్నం చేశారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న సుబ్బ రామయ్యను కుటుంబ సభ్యులు నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య ముత్యాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎ.సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



150 మద్యంబాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని బీరంగుంట పంచాయతీ రైస్‌మిల్ కాలనీ వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో 150 అక్రమ మద్యం బాటిళ్లు బయటపడినట్లు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివరాలిలా ఉన్నాయి. మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన జానా నాగరాజు, సాయి అనే ఇద్దరు వ్యక్తులు వాలెట్ మద్యం షాపులో కాటంగారి మహేష్ అనే వ్యక్తి వద్ద మద్యాన్ని కొనుగోలు చేసి యూనికార్న్ బైక్‌పై వస్తూ ఉండగా అదుపుతప్పి పడిపోయినట్లు వివరించారు. వెంటనే ఆ ఇద్దరిని అరెస్ట్ చేసి, మద్యం అమ్మిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అందులో కొన్ని మద్యం బాటిళ్లు పగిలిపోయాయని తెలియజేశారు.

బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా దర్శి గ్రామానికి చెందిన సోము కృష్ణారెడ్డి, వెంకటసుబ్బమ్మ దంపతులు స్వామి వారికి విరాళంగా రెండు జతలు, బిజ్జం పెంచలరెడ్డి చౌడేశ్వరమ్మ, బిజ్జం వేణుగోపాల్ రెడ్డి, విజయమ్మ దంపతులు అలంకరణ ఆవరణ కిరీటాలు అందజేశారు. నానేపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, విజయమ్మల దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కావలికి చెందిన బంగారుపాళ్యం శ్రీ గౌరీ అమ్మవారి ఉత్సవ సంకీర్తన విభాగం భజనను నిర్వహించారు. సనాతన ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విజయవాడ ఉమెన్స్ డాక్టర్ గ్రూప్ వారి సహకారంతో రెండవ రోజున మజ్జిగ, మినరల్ వాటర్‌ను సనాతన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డుకూరి నారాయణ ఆధ్వర్యంలో భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో బంక శ్రీనివాసులు ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపునకు ప్రచారం

ప్రజాశక్తి ఆత్మకూర్ అర్బన్ : తూర్పు రాయలసీమ శాసనమండలి వైసిపి అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆత్మకూరు పట్టణ జెసిఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆదిశేషయ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపారం వెంకట రమణమ్మ, మాజీ చైర్మన్ ఇందూరు వెంకటరమణరెడ్డి, నోటి వినయ్ కుమార్ రెడ్డి, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, షేక్ రహీం, సురేష్, యాదవ్, ఇరగన వెంకటేశ్వర్లు, సందపరం ప్రతాప్, వల్లెపు వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి-సంగం : మండలం దువ్వూరు గ్రామంలో టిడిపి పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ గెలుపుకు టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు కన్నబాబు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దయాకర్ గౌడ్, విజయ కృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు మంజుల, రఘురామయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న పిడిఎఫ్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-వరికుంటపాడు

నిరుద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు తీర్చాలంటే యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిని గెలిపించాలని యుటిఎఫ్ జిల్లా ప్రతినిధి ఆర్.నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన వరికుంటపాడులో యుటిఎఫ్ ఉపాధ్యాయులతో పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి వెంకటేశ్వరరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఉపాధ్యాయులను నిరుద్యోగులను మోసం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తుందని ఆ ఇబ్బందులు తీరాలంటే మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్‌వి నారాయణ, వివి సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు మేడసాని సుబ్బారావు, కరిముల్లా, కాంతారావు, వెంకటసుబ్బయ్య, ధనికుల వెంకటేశ్వరరావు, దామోదర్ రావు, బి.రమణయ్య, మనోహర్, గోపి, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని యుటిఎఫ్, ప్రజా సంఘాల నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మండలం కామిరెడ్డిపాడు, మంగుపల్లి, చిలకలమర్రి, రేవూరు


అనంతసాగరంలో..

గ్రామాలలోని పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బాబు రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యుటిఎఫ్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కావలిలో...

ప్రజాశక్తి-కావలి : స్థానిక వైకుంఠపురం మెయిన్ రోడ్డు, జెండాచెట్టు సెంటర్, పోలేరమ్మగుడి, పిచ్చిరెడ్డి బజారు, గణేష్ అపార్ట్మెంట్, తదితర ప్రాంతాలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని శుక్రవారం డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెద్దల సభలో నిరుద్యోగులు, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్, ఉపాధ్యాయ, కార్మిక వర్గ, ప్రయివేట్ విద్యాసంస్థల లెక్చరర్ల ఉపాధ్యాయుల, తరపున ప్రశ్నించే అభ్యర్థి పిడిఎఫ్ తరపున పట్టభద్రుల నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వర రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అలాగే ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా పోటీ చేస్తున్న పొక్కిరెడ్డి బాబురెడ్డికి కూడా మొదటి ప్రధాని ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పసుపులేటి పెంచలయ్య, బోగిశెట్టి కిష్టయ్య, జి మధుసూదన్ రావు, వి.సుబ్రహ్మణ్యం, వై.కృష్ణమోహన్, పసుపులేటి పెంచలనరసింహం, గోచిపాతల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పొట్టేపాలెంలో...

ప్రజాశక్తి-నెల్లూరు : శాసనమండలిలో ప్రజల సమస్యలపై మాట్లాడే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిని గెలిపించాలని కోరుతూ నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాలెం గ్రామంలో గ్రాడ్యుయేట్స్ ఓటర్స్‌ను కలిసి ఓటేయాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు ఆలూరు తిరుపాలు, అల్లాడి గోపాల్, ముత్యాల నాగయ్య, ఎడవల్లి రమణయ్య, బోయిన హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్ : మార్చి 13వ తేదీన జరగనున్న తూర్పు రాయలసీమ శాసనమండలి ఎన్నికలలో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించాలని శుక్రవారం పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాసంఘాల నాయకులు


ఆత్మకూరులో..

ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలను గెలిపించాలని కరపత్రాల పంచి వారిని అభ్యర్థించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.


ఉదయగిరిలో...

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉపాధ్యాయ గ్రాడ్యుయేట్ సమస్యల పరిష్కారానికి పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకొందామని ప్రజాసంఘాల నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ, ప్రయివేటు రీసెట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ తదితర పట్టభద్రుల ఉపాధ్యాయులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగ నిర్మూలన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూ నిర్భయంగా సమస్యలపై గళం విప్పే పిడిఎఫ్ ఎంఎల్‌సి పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పొక్కిరెడ్డి.బాబురెడ్డిలను మొదటి ఓటేసి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం నాగేశ్వరరావు, కామాక్షమ్మ, నాయబ్ పాల్గొన్నారు.


పెట్రోల్ పోసుకుంటున్న మండవ వెంకట్రావు

అక్రమ నిర్మాణాలు ఆపాలి

- వికలాంగుడి ఆత్మహత్యాయత్నం
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి-కావలి

ముసునూరులోని వికలాంగుల కాలనీలో అక్రమ కట్టుబడులు ఆపాలని స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట వికలాంగులు ధర్నా చేస్తుంటే, తహశీల్దారు స్పందించక పోగా కార్యాలయం తలుపులు మూయించాడు. అందుకు నిరసనగా వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి శుక్రవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని కాల్చుకునేందుకు సిద్ధపడ్డాడు. సమీపాన ఉన్న వికలాంగులు తమ నాయకుని ప్రయత్నానికి అడ్డుపడ్డారు. ఈ సందర్భంగా మండవ వెంకట్రావు మాట్లాడుతూ శుక్రవారం కూడా వికలాంగుల కాలనీలో అక్రమంగా కట్టుబడి చేస్తున్నారని తెలిపారు. ఫొటోలు తియడానికి పాయినవరినీ తిడుతున్నారన్నారు. వి.ఆర్.ఒ., పోలీస్ వారు ఆపమన్నా అక్రమ కట్టుబడి సాగుతూనే ఉందని తెలిపారు. వికలాంగుల స్థలాల్లో నిర్మించే అక్రమ కట్టడాలను తక్షణమే నిలిపి వేయాలని, నిందితులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే వికలాంగులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు.

సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు


ప్రజాశక్తి-సంగం : మండలం పడమటిపాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయంలో 21వ వార్షికోత్సవ కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి వారికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజిత, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.


పిచికారీ చేస్తున్న వైద్యసిబ్బంది

కంపసముద్రంలో డెంగీ కలకలం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని కంపసముద్రం ఎస్‌సి కాలనీలో డెంగీ జ్వరం కలకలం రేపుతోంది. అదే గ్రామానికి చెందిన నల్లిపోగు చిన్నయ్యకు జ్వరం రావడంతో వైద్యసిబ్బంది ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి పంపగా అక్కడ రక్త పరీక్ష చేయగా డెంగీ జ్వరం నిర్ధారణ అయింది. వెంటనే స్పందించిన డాక్టర్లు కల్పన, గోపినాథ్ సబ్ యూనిట్ అధికారి ఎస్.జి నౌషాద్‌బాబు, ఆరోగ్య విస్తరణ అధికారి ఎన్.కొండారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందిని నాలుగు టీములుగా విభజించి ఇంటింటికి తిరుగుతూ లార్వా, జ్వర పీడితుల సర్వే, ఇన్డోర్ స్పేస్ స్ప్రేయింగ్, ఆంటి లార్వా ఆపరేషన్ చేయించారు. 95 ఇళ్ల లోపల పైరత్రం పిచికారీ చేయించారు. టిబి ఆర్గనైజర్ బి.కొండారెడ్డి హెచ్ వి.సంపూర్ణమ్మ, సూపర్‌వైజర్లు ఎస్.కె.సైదా, ఎస్‌కె.ఖాజామోహిద్దీన్, హెల్త్ అసిస్టెంట్లు డి.రమణయ్య, బి.అంకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాలకొండారెడ్డి

విద్యాహక్కుపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కావలి : సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యాహక్కు చట్టం ప్రకారం బాల బాలికలను పాఠశాలలో చేర్పించాలని సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం కరేటివారిపాలెంలో ప్రభుత్వ జిల్లాపరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యాహక్కుచట్టంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎం.మాలకొండారెడ్డి మాట్లాడుతూ బడిఈడు పిల్లలు స్కూలు బయట తిరగటం వల్ల వారు బాలకార్మికులుగా మారుతున్నారని ఆయన ఆవేదన చెందారు. ఇప్పటికైనా బాల బాలికలకు విద్యే ఉజ్వల భవిష్యత్తును తల్లిదండ్రులు భావించి బాల బాలికలను పాఠశాలలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని కోరారు. విద్యాహక్కు చట్టం 2009లో అమల్లోకి వచ్చిందని పౌర సంఘాలు, విద్యాశాఖ కలిసి సమాజంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి నిరుపేదలైన మత్స్యకారులు, గిరిజనులు, వారు తల్లిదండ్రులు తలరాతలు మారాలంటే పాఠశాల విద్య నుండి ఉన్నత విద్య అభ్యసించే వరకు ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండల పరిధిలోని పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన నాడు-నేడు పనులకు సంబంధించి వసతుల కల్పన కోసం శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు ఎల్‌వి నారాయణకు పిఎంసి కమిటీ సభ్యులు విన్నవించారు. రెండో విడత నాడు-నేడు పథకం కింద పాఠశాలకు మంజూరైన రూ.99 లక్షల నిధుల్లో ఇంతవరకు కేవలం రూ.17 లక్షలు మాత్రమే విడుదలవడంతో పూర్తిస్థాయి పనులు చేపట్టనే లేదన్నారు. దీంతో గత ఏడాది డిసెంబర్ నుంచి పనులు నిలిచిపోవడంతో నిత్యం విద్యార్థులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చక్క రాజేంద్ర, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన గ్యాస్ ధరలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌కు రూ.50 పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి, సిపిఎం పట్టణ కమిటీ సభ్యురాలు షేక్ గుల్జర్ బేగం పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ ఇప్పటికే నిత్యవసర ధరలు, పెట్రోల్ డీజిల్, కరెంట్ ఛార్జీలు వీరికి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 460 ఉన్న గ్యాస్ ధర ఇప్పుడు రూ.750లకు గ్యాస్ ధర పెంచి అడ్డు అదుపు లేకుండా పేద ప్రజలపై ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. ఈ ధరల ప్రభావం వలన చాలీచాలని తిండి తిని జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమర్షియల్ సిలిండర్ ధరలు విపరీతంగా పెరిగిన దాని వల్ల చిరు



వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. దాని ప్రభావం ప్రజలపై పడిందని, కేంద్ర ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల్లో ఎలక్షన్ అయినంత వరకు ధరలు పెంచకుండా తర్వాత ధరలు పెంచడం అన్యాయమని దుర్మార్గమని విమర్శించారు. ఇప్పటికైనా పెంచిన ధరలు తగ్గించాలని లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వారు హెచ్చరించారు.

భూసమస్య పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కావలి

మండల పరిధిలోని చలంచర్ల గ్రామం పరిధిలోని పెద్దారంలో భూసమస్య పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించగా, వేసుకున్న జామాయిల్ అక్రమంగా నరికి వేయగా, ఓ నిరుపేద రైతు కుటుంబం వీధిన పడింది. వైసిపి ఆగడాలు తట్టుకోలేక ఆ కుటుంబం శుక్రవారం రైల్వే స్టేషన్ రోడ్డులోని "జర్నలిస్ట్ క్లబ్"ను ఆశ్రయించి తమ గోడును మీడియా ప్రతినిధులతో వెళ్లబోసుకొంది. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి చెందిన బొబ్బల కొండయ్య మాట్లాడుతూ తాను గత 25 సంవత్సరాలకు పైగా సర్వే నెంబర్ 841లో శివాయి భూమిలో 5 ఎకరాలు సాగు చేసుకుంటూ, తాను జీవనం సాగిస్తున్నానని తెలిపారు. ఈ భూమినీ తనఖాకు కొండయ్య కుటుంబం తమ గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఇరువూరి శ్రీహరి నాయుడు, తిరుపతయ్య రాజకీయ పలుకుబడితో తన పొలంలో సాగు చేసుకొన్న చేతికొచ్చిన జామాయిల్ పంట అక్రమంగా నరికి వేసేందుకు సహకరించారని వాపోయారు. ఈ సమాచారాన్ని కావలి తహశీల్దార్‌కు, రూరల్ పోలీసులకు జిల్లా




మాట్లాడుతున్న బాధిత కుటుంబం

కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళానని, అయినా పరిష్కారం కాలేదని విలపించాడు. తన ఇద్దరు కుమారులు తనకు చేదోడు వాదోడుగా ఉంటారని భావిస్తే విధి తనకు దూరం చేసిందని, ఇందులోనూ వైసిపి నాయకులు ప్రభుత్వ పరంగా ఎలాంటి సహాయం అందకుండా చేశారని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఇదంతా ఎంఎల్‌ఎ అండదండలతో చేస్తున్నారని, ఇక తన భూమి తనకు దక్కడం సాధ్యం కాదని భావించి పురుగులు మందు తాగి, ఆత్మ హత్యే శరణ్యమని పురుగుల మందు చేతపట్టుకొని కన్నీటి పర్యంతమయ్యారు. ఇందులో బాధిత కుటుంబానికి చెందిన బొబ్బల అనసూయమ్మ, కోడళ్లు వైదేవి, అనిత, బంధువులు చింతం కల్లయ్య, సబ్బయ్య ఉన్నారు.

సమావేశం విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : శనివారం జరిగే టిడిపి నాయకుల సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు చింతనబోయిన బయన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం 4 గంటలకు స్థానిక చెంచలబాబు యాదవ్ అతిథిగృహంలో జరుగు ఎంఎల్‌సి ఎన్నికల సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉదయగిరి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎలు బొల్లినేని వెంకట రామారావు, కంభం విజయరామిరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిలు మాజీ జెడ్‌పి చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్, పెళ్లికూరి శ్రీనివాసరెడ్డి, నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్ దామరచర్ల సత్య సమావేశంలో పాల్గొంటారన్నారు.


విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎంఇఒ మస్తాన్‌వలీ

నైపుణ్య సామర్థ్యాలు పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి

విద్యార్థుల అభ్యసన నైపుణ్య సామర్థ్యాలను మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్ వలీ పరిశీలించారు. శుక్రవారం మండల పరిధిలోని సున్నంవారి చింతల ఎంపిపిఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతుల వారీగా విద్యార్థుల పఠన అభ్యసన నైపుణ్య సామర్థ్యాలను పరిశీలించి నల్లబల్లపై విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరిశీలించారు. 4, 5వ తరగతుల విద్యార్థులకు కూడడం, తీసివేయడం, పెంచడం, భాగించడం తప్పనిసరిగా వచ్చి ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. క్రమం తప్పకుండా ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టుల వర్క్‌బుక్‌లను పూర్తి చేసే విధంగా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల, ఉపాధ్యాయుల, మధ్యాహ్న భోజన నిర్వాహకుల, ఆయాల అటెండెన్స్ రిజిస్టర్‌లు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తూ విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచి చూచికరంగా ఉండేటట్లు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

కొండబిట్రగుంటలో 'ఫ్రైడే డ్రైడే'

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొండబిట్రగుంట గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారిణి, కావలి డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ పి.బ్రిజిత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు ఇంటింటికీ తిరిగి దోమల లార్వా సర్వేను, ఫీవర్ సర్వేను పరిశీలించి ఆరోగ్య సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియాసిస్, బోద వ్యాధి, జపనీస్ ఎన్ సెఫలైటిస్ చిన్న పిల్లలలో వచ్చే మెదడు వాపు వ్యాధి సోకకుండా ఉండాలంటే ప్రతిఒక్కరూ దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు గుడ్లు పెట్టడం వల్ల వాటి నుండి దోమల వృద్ధి చెందుతాయని, ప్రతి శుక్రవారం ప్రతి ఇంటిలోని కంటైనర్లు, నీటి తొట్టెలు మొదలైన వాటిలో ఉండే నిల్వ నీటిని పూర్తిగా పారబోసి, వాటిని శుభ్రపరచి ఒక గంటసేపు ఎండలో ఆరబెట్టుకొని మళ్లీ తాజాగా నీటితో నింపుకొని వాటిపై పూర్తిగా మూతలు ఉంచుకోవాలని తెలిపారు. ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలందరూ సహకరించి ప్రతి శుక్రవారం తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. శ్రీ ప్రసన్న


పరిశీలిస్తున్న డాక్టర్ బ్రిజిత

వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి వెళ్లి అక్కడ అందించే వైద్య సేవలను పర్యవేక్షించారు. అత్యవసర వైద్య చికిత్స సేవలు అవసరమైన వారికి చేసిన ఏర్పాట్లు తనిఖీ చేసి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.రవికుమార్, ఆరోగ్య విస్తరణ షేక్ ఇలియాస్, ఆరోగ్య పర్యవేక్షకులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు అందక ఇబ్బందులు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో ఆధార్ సేవలు అందక వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు ఎండ తీవ్రత నుండి తప్పించుకోవడానికి ఉదయాన్నే సచివాలయానికి ఆధార్ సేవల కోసం రాగా సచివాలయ సిబ్బంది వారికి నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సర్వర్ పనిచేయడం లేదని చెబుతున్నారు. మిగతా సచివాలయాల్లో ఆధార్ కేంద్రం పనిచేస్తుందని మర్రిపాడులో సర్వర్ ఇబ్బందిగా ఉందని సిబ్బంది చెప్పగా సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆధార్ కేంద్రానికి వచ్చినవారు సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. సచివాలయాలపై ఉన్నత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.